క్లుప్తంగా

పార్టీలో కష్టపడేవారికి తప్పక గుర్తింపు



ఎమ్మెల్యే గొల్ల బాబూరావును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎస్.రాయవరం : పార్టీ పట్ల విశ్వాసం చూపించేవారికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ పెద్ద పీట వేస్తూనే ఉంటారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. బుధవారం నియోజక వర్గానికి చేరుకున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకి అడ్డురోడ్డు జంక్షన్‌లో స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, శ్రీపతిరాజు, మాజీ జెడ్పీటీసీ కొంకోట నీలేంద్రరావు తదితరులు కలిసి ఎమ్మెల్యేని దుస్సాలువాతో సత్కరించారు. పెనుగొల్లు పీఏసీఎస్ చైర్‌పర్సన్ దోసపాత్రుని హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అద్దేపల్లి నూకునాయుడు, మామిడి చంటి, అచ్యుతరామరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్‌ఐ రమణయ్య



ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్‌ఐ రమణయ్య

ఎస్.రాయవరం : కోటవురట్ల మండలం నూతన ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన రమణయ్య బుధవారం కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావును మర్యాదపూర్వకంగా కలిశారు. సంక్రాంతి సమయంలో మండలంలో అందుబాటులో ఉంటూ దోపిడీలు జరగకుండా గట్టి నిఘా పెడతామని చెప్పారు. ఇళ్లకు తాళాలు వేసుకుని ఊర్లు వెళ్లే వారి వద్ద నుంచి ముందుగా సమాచారం తీసుకుని రక్షణ కల్పించాలని ఎమ్మెల్యే ఎస్‌ఐకు సూచించారు.

వైఎస్సార్ బీమా అందజేత



వైఎస్సార్ బీమా అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక : వైఎస్సార్ బీమా పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు కోరారు. మునగపాక బీసీ కాలనీలో ఇటీవల వైదర్సు సత్యవతి మృతిచెందారు. ఆ కుటుంబ సభ్యులకు బుధవారం వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా తొలివిడతగా రూ.10వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ బీమా పథకం అర్హులకు అందుతుం దన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, పార్టీ అధికార ప్రతినిధి కాశీబాబు, పార్టీ నేత అప్పారావు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ భాస్కరరావు పాల్గొన్నారు.

నర్సింహమూర్తి కోలుకోవాలని..



పూజల కోసం ఉపమాక వచ్చిన కార్యకర్తలు

నక్కపల్లి : ఇటీవల అడ్డురోడ్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖలోని ఎంజి ఆస్పత్రిలో ఐసీయులో చికిత్స పొందుతున్న నక్కపల్లి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి త్వరగా కోలుకోవాలంటూ పలువురు నాయకులు కార్యకర్తలు పూజలు నిర్వహించారు. బుధవారం వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సర్పంచ్, ఎంపీటీసీలు ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అఖిలాండం వద్ద కొబ్బరి కాయలు కొట్టి బేడామండపం చుట్టు ప్రదక్షిణలు చేశారు. ఎంపీటీసీలు లొడగల చంద్రరావు, కొల్నాటి బుజ్జి, సర్పంచ్‌లు నాగ అప్పలరాజు, అల్లు రమణ, ముసలయ్య, శ్రీను, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, నాయకులు గొర్ల బాబూరావు, జేసీఎస్ కన్వీనర్లు గోవిందు, వియ్యపు శ్రీను, ఎస్‌రామకృష్ణ, నూకతాత, ఈశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పండగ

- మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం
- క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారుల ఉత్సాహం
- పాల్గొంటున్న 27 జట్లు



క్రికెట్ బ్యాట్ చేతపట్టిన ఎంపీపీ కోన సంధ్య



అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్‌లో వాలీబాల్ ఆడుతున్న జట్లు



క్రీడాకారులతో ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

అచ్యుతాపురం : క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవడంతో పాటు, గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని అచ్యుతాపురం ఎంపీపీ కోన సంధ్య బుజ్జి అన్నారు. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం పోలీస్ గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారుల్ని పరిచయం చేసుకున్నారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ క్రీడలకు సంబంధించిన 27 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. 18వ తేదీ మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించనున్నారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు దేశంశెట్టి శంకర్ రావు, కూండ్రపు వెంకునాయుడు, ఎంపీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

మండల స్థాయిలోనూ రాణించాలి...

యలమంచిలి : క్రీడాకారులు మండల స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచి తమ గ్రామాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. బుధవారం యలమంచిలి మండలంలో రాజీవ్ క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీడీవో అప్పలనాయుడుతో కలసి ప్రారంభించారు. మండలంలో వివిధ సచివాలయాల నుంచి గ్రామ స్థాయిలో ఆయా క్రీడల్లో ప్రతిభ కనబరిచి మండల స్థాయికి చేరుకున్న క్రీడాకారులను ముందుగా ఆయన పరిచయం చేసుకున్నారు. ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో క్రీడల్లో ప్రతిభా పాటవాలు చూపి గ్రామాలకు, యలమంచిలి మండలానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని అన్నారు. బుధవారం ఉదయం ఖోఖో, కబడ్డీ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీలలో మండలంలో వివిధ సచివాలయాలకు చెందిన క్రీడా జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, మండల అధికారులు,సచివాలయాల అధికారులు, క్రీడాకారులు, కోచ్‌లు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ అన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రీడాపోటీలను ఎంపీపీ జయలక్ష్మితో పాటు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ ఇటువంటి పోటీలు నిర్వహించడం ద్వారా క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. మండల స్థాయి పోటీల్లో రాణించి జిల్లా స్థాయికి ఎంపిక కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైస్ ఎంపీపీ చిందాడ దేవి, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంఈవో వేణుగోపాలరావు, ప్రత్యేకాధికారి రమామణి, ఎంపీటీసీలు రాము, గణేష్, పార్టీ నాయకులు అప్పారావు, కాశీబాబు పాల్గొన్నారు. మొదటిరోజున వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో క్రీడాకారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడలు బాగా ఉపయోగపడతాయని వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న అన్నారు. మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడలు తిమ్మాపురం గ్రామంలో బుధవారం ప్రారంభించారు. ఇటీవల గ్రామ సచివాలయ స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో విజేతలు మండల స్థాయికి ఎంపికయ్యారు. వారికి మండల స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మండల స్థాయి పోటీలు సంక్రాంతి ముందు సందడి వాతావరణం నింపేలా ఉంటాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మహేష్, ఎంపీడీవో రామచంద్రమూర్తి, ఎంఈవో మూర్తి, సర్పంచ్ కర్రి సత్యనారాయణ, పీడీలు రాజు, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాయకరావుపేట : ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడలు పట్టణంలో ప్రారంభమయ్యాయి.



అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్‌లో కబడ్డీ ఆడుతున్న బాలికలు

మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.సాంబశివరావు క్రీడలను ప్రారంభించారు. 24 గ్రామాలకు గాను 24 జట్లు పోటీల్లో నిలిచాయి. కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు అధికారులు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ (క్రీడలు) టి.రవికుమార్ పర్యవేక్షణలో క్రీడలు జరిగాయి. కార్యక్రమంలో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, ఎంఈవోలు కె.ఎన్.గాంధీ, రమేష్ బాబు, గ్రామ కార్యదర్శులు వై.వి.సత్యనారాయణ, నరేష్ పాల్గొన్నారు.



క్రీడాకారుల పరిచయ కార్యక్రమంలో ఎంపీపీ గోవింద్



మునగపాకలో మండల స్థాయి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ



మునగపాక జెడ్పీ స్కూల్లో వాలీబాల్ పోటీలో తలపడుతున్న జట్లు



తిమ్మాపురంలో మండల స్థాయి క్రీడలు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న



పాయకరావుపేట : క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో సాంబశివరావు

అధికారులు బాధ్యతగా మెలగాలి..



రాంబిల్లి మండల సర్వసభ్య సమావేశంలో వ్యవసాయశాఖ వివరాలను వెల్లడిస్తున్న ఏవో

కోటవురట్ల : సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఎంపీపీ శింగంపల్లి అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారంపై అధికారులు వివరణ ఇచ్చారు. అనంతరం జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, వైస్ ఎంపీపీ ఆర్.ఎస్. సీతారామరాజు శాఖల వారీ సమీక్ష చేశారు. వారు మాట్లాడుతూ అధికారులు పనితీరు మార్చుకోవాలని బాధ్యతగా మెలగాలని సూచించారు. సన్యాసిరాజుపాలెం ఎంపీపీ స్కూల్‌లో ఓ ఉపాధ్యాయుడు సరిగ్గా విధులకు హాజరు కావడం లేదని, దీంతో పిల్లల చదువులు అటకెక్కుతున్నాయని ఎంపీటీసీ పెట్ల రాంబాబు ఆరోపించారు. గత సమావేశంలో కూడా అతనిపై ఫిర్యాదు చేశామని ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఎంఈవోలను డిమాండ్ చేశారు. మీరు చర్యలు తీసుకోకపోతే నేరుగా విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్‌కు పిర్యాదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. మరో ఎంపీటీసీ పుట్రేవు సూర్యారావు మాట్లాడుతూ తరచూ సర్వసభ్య సమావేశాలకు డుమ్మా కొడుతున్న అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావును ప్రశ్నించారు. గత సమావేశంలో కరువు మండలంగా ప్రకటించాలని సభ్యులంతా తీర్మానం చేస్తే ఉన్నతాధికారులకు ఎందుకు ప్రతిపాదన పెట్టలేదని ప్రశ్నించారు. మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంటే రెవెన్యూ అధికారులు, పోలీసులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. మండలంలో రబీ సీజను మొదలైందని, సాధారణ సాగు 1250 ఎకరాలు కాగా ఇప్పటికి 350 ఎకరాలలో నాట్లు పూర్తయినట్టు ఏవో సరోజిని తెలిపారు. ప్రతి రైతు వేసిన పంటకు ఈ-క్రాప్ కచ్చితంగా చేయించుకోవాలని సూచించారు. మిచాంగ్ తుపానులో దెబ్బతిన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మండలంలోని 3 క్లస్టర్లలో కేంద్రాలు పనిచేస్తున్నాయని, ఇప్పటి వరకు 5 లోడులు వెళ్లినట్టు తెలిపారు. జిల్లా పరిషత్ నిధుల నుంచి 16 పనులు మంజూరు కాగా ఇప్పటి వరకు 13 పనులు పూర్తయినట్టు పీఆర్ జేఈ వర్మ తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ రాంబాబు

సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం తగదు

రాంబిల్లి : సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలని ఎంపీపీ జి. శిరీష అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. విద్యుత్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖల అధికారుల పనితీరుపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పలువురు అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై స్పందించిన ఎంపీపీ ఇకపై అధికారులు తీరు మార్చుకోవాలన్నారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను వచ్చే సర్వసభ్య సమావేశంలో పరిష్కరించిందీ లేనిదీ సంబంధిత అధికారే సమావేశంలో తెలియజేయాలన్నారు. ఒకవేళ పరిష్కరించ లేకపోతే అందుకు గల కారణాన్ని చెప్పాల్సి వుంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైస్ ఎంపీపీలు కొట్టాపు లక్ష్మి, కశిరెడ్డి నర్సింగరావు, ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వరి రైతులకు అండగా జగనన్న ప్రభుత్వం

- ఎంపీపీ కోన సంధ్య బుజ్జి
- హరిపాలెం, కొండకర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ కోన సంధ్య బుజ్జి



మునగపాకలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

అచ్యుతాపురం : రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు చొరవ చూపుతోందని అచ్యుతాపురం ఎంపీపీ కోన సంధ్య బుజ్జి అన్నారు. అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల, హరిపాలెం రైతు భరోసా కేంద్రాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర ఇచ్చేందుకు ముందు వచ్చిందన్నారు. రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకొంటుందని తెలిపారు. జెడ్పీటీసీ లాలం రాంబాబు మాట్లాడుతూ మిల్లర్లతో సంబంధం లేకుండా రైతుల నుంచి నేరుగా ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రవాణా, హమాలీ, గోనె సంచుల ఛార్జీలను సైతం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, ఏఓ బి.శంకర్ గోవింద్, విస్తరణ అధికారి కె.బి సూర్యనారాయణ, ఎల్.వరలక్ష్మి, వీఏఏలు ఎస్.రాజ్‌కుమార్, కె.నీరుజ, జాస్మిన్, రైతులు కోరిబిల్లి నాగరాజు, పెంటకోట వెంకట అప్పారావు, ఎంపీటీసీ కాండ్రేగుల జ్యోతి ప్రసాద్, ఉప సర్పంచ్ కాండ్రేగుల వెంకట సీతారాం పాల్గొన్నారు.

మునగపాకలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మునగపాక: రైతులను ఆదుకునేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మునగపాక పీఏసీఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. ధాన్యం గ్రేడ్-ఏ రకం 100 కిలోలకు రూ.2203, అలాగే కామన్ రకం వంద కిలోలకు రూ.2183 అందజేస్తామన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, ఎంపీటీసీలు రాము, గణేష్, పార్టీ అధికార ప్రతినిధి కాశీబాబు, సచివాలయ కన్వీనర్ మహేష్, నేతలు అప్పారావు, ఎర్రయ్యనాయుడు పాల్గొన్నారు.

సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై దృష్టి పెట్టండి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రత్నం

నక్కపల్లి : సమావేశాల్లో సభ్యులు ప్రస్తావించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధికారులను ఆదేశించారు. బుధవారం నక్కపల్లి మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యులు ప్రస్తావించిన అంశాలను మినిట్స్ పుస్తకంలో నమోదు చేసి పరిష్కారం అయ్యే వరకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశాలకు హాజరు కాని అధికారులపై చర్యలకు సిఫార్సు చేయాలన్నారు. తహసీల్దార్ అంబేద్కర్ మాట్లాడుతూ మండలంలో రీ సర్వే చురుగ్గా జరుగుతోందన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సచివాలయాల్లోనే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ రీసర్వే జరిగిన గ్రామాల్లో చాలా మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందడం లేదని, వెంటనే పాసు పుస్తకాలు జారీకి చర్యలు తీసుకోవాలని కోరారు. మత్స్యశాఖ అధికారులు అందుబాటులో ఉండడం లేదని, ఎఫ్‌డీవో ప్రతి సమావేశానికి రావడం లేదని పెద తీనార్ల ఎంపీటీసీ మేరుగు నాగేశ్వరావు తెలిపారు. నక్కపల్లి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఈశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కోవిడ్ జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కాసులమ్మ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, వీసం నానాజీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సీతారామరాజు పాల్గొన్నారు.

సారాతో పట్టుబడిన వ్యక్తి అరెస్టు

కోటవురట్ల : నాటుసారాతో పట్టుబడిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాల ప్రకారం నాటుసారా విక్రయిస్తున్నారన్న సమాచారంతో సుంకపూరు గ్రామంలో పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన అనపర్తి అప్పారావు అనే వ్యక్తి 2 లీటర్ల నాటు సారాతో పట్టుబడ్డాడు. నాటుసారా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పండగ నేపథ్యంలో మద్యం విక్రయాలు చేసినా పేకాట, కోడిపందాలు ఆడినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

బాల్య వివాహాలు నివారించాలి

మునగపాక: బాల్య వివాహాలను అరికట్టాలని మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఏఐ పాలకొండ రమేష్ కోరారు. ఇందుకు తల్లిదండ్రులు కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. మునగపాకలో బుధవారం బాల్య వివాహాల కారణంగా జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్న వయస్సులో బాలికలకు వివాహం చేయడం నేరమన్నారు. తెలిసీ తెలియని వయస్సులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణంపై వివాదం



ఎంపీడీవో కాశీవిశ్వనాథరావును ప్రశ్నిస్తున్న జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్

కోటవురట్ల: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కొత్తగా నిర్మిస్తున్న సీసీ రోడ్డుపై వివాదం నెలకొంది. జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు పైల రమేష్ సీసీ రోడ్డు నిర్మాణంపై ఎంపీడీవోను ప్రశ్నించారు. సీసీ రోడ్డుకు ఎస్టిమేషన్, మంజూరు లేకుండా ఎలా నిర్మిస్తున్నారని, గ్రామాల్లోని సమస్యలు కనిపించలేదా అంటూ ప్రశ్నించారు. కనీసం మండల పరిషత్ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఎలా మీకు నచ్చినట్టు సీసీ రోడ్డు వేస్తారని ప్రశ్నించారు. ఎవరో ఒక కాంట్రాక్టర్‌కు మేలు చేకూరేందుకు ఈ రోడ్డు నిర్మిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచులు అనిల్‌కుమార్, పైల శివరాం, వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ ఎంపీడీవో తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు వివరణ ఇస్తూ పలు ప్రభుత్వ కార్యాలయాలకు సీసీ రోడ్డు అవసరం ఉన్నందున 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి సీసీ రోడ్డుకు రూ.4 లక్షలు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. దీనిపై అపోహ పడుతున్నారని, ఎస్టిమేషన్ వేసిన తర్వాతనే నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.

గ్రామాల్లో పర్యటిస్తున్న సమన్వయకర్త



గ్రామాల్లో పరిచయ కార్యక్రమాల్లో కంబాల జోగులును అభినందిస్తున్న నాయకులు

పాయకరావుపేట : నియోజకవర్గ సమన్వయ కర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు బుధవారం గోపాలపట్నం, మాసాహేబుపేట, సత్యవరం, పెదరాం భద్రపురం, శ్రీరాంపురం గ్రామాల్లో పర్యటించారు. పార్టీ మండల అధ్యక్షుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు ఆయా గ్రామాల్లో నాయకుల్ని పరిచయం చేశారు. గోపాలపట్నం గ్రామంలో మిచాంగ్ తుపానుకు కొబ్బరిచెట్టు పడి గేదె చనిపోయిన కుటుంబానికి రూ.20 వేలు బీమా నగదును కంబాల జోగులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మనందరం కలిసి జగన్‌మోహన్‌రెడ్డినే మరలా ముఖ్యమంత్రిని చేయాలని అన్నారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పన్నీరు బాబ్జి, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాస్, సకిలేటి రాము, గంపల మూర్తి, ఎంపిపి ఇసరపు పార్వతీ తాతారావు నాయకులు యజ్జల అన్నవరం, పల్లేల వెంకట్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మేల్కొలుపులు

రాంబిల్లి: పవిత్రమైన ధనుర్మాసంలో గ్రామాల్లో భక్తిభావం వెల్లివిరుస్తుంది. పల్లెల్లో వేకువజామున భక్తులు మేలుకొలుపు నిర్వహిస్తున్నారు. వీధుల్లో భజనలు చేస్తూ తిరుగుతూ నగర సంకీర్తన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మహిళలు, పురుషులు ఉత్సాహంగా ఈ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు.

తోటాడలో కాలువల్లో పూడికతీత

మునగపాక : పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు తెలిపారు. తోటాడ పంచాయతీలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికతీత పనులను ఆయన బుధవారం పరిశీలించారు. వార్డు సభ్యుడు బుద్ద రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ కాలనీలో జగనన్న సురక్ష



జగనన్న ఆరోగ్య సురక్షలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న మహిళలు

యలమంచిలి : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీ ఎన్‌టీఆర్ కాలనీ సచివాలయ పరిధిలో బుధవారం జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. స్థానిక సచివాలయం పరిధిలో కంటి వైద్య నిపుణులు, జనరల్ ఫిజీషియన్, వైద్య సిబ్బంది వివిధ ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు షుగర్, బీపీ, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వృద్ధులు, మహిళలు కంటి పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులును పొందారు. మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య శిబిరాలు ద్వారా వైద్య పరంగా ఆర్థికంగా ఎలాంటి ఖర్చు లేకుండా ప్రభుత్వం ప్రజల వద్దకే వచ్చి ఉచితంగా ఆరోగ్య సేవలందిస్తుందని వివరించారు.